నిరుద్యోగ భృతిపై గంపెడాశలు

- వేయికళ్లతో ఎదురుచూస్తున్న నిరుద్యోగులు
- ఉద్యోగం వచ్చేవరకు నెలకు రూ. 3వేల భృతి అంటూ హామీ
- సెంట్రల్‌లో 95,292 గృహాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్):టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తాము అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని ఎన్నికల ముందు ప్రచారం హోరెత్తించింది. సూపర్ సిక్స్‌లో యువతకు ఉద్యోగాలు, లేదా నెలకు రూ. 3వేల నిరుద్యోగ భృతి ఇస్తామని కూటమి హామీ ఇచ్చింది. దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యోగం లేదా నెలకు రూ. 3వేలు నిరుద్యోగ భృతి వస్తుందని నమ్మారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల రోజులు పూర్తయింది. నిరుద్యోగులు భృతిపై గంపెడాశలు పెట్టుకున్నారు. నిరుద్యోగ భృతి రిజిస్ట్రేషన్ కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. నిరుద్యోగ భృతిపై ప్రభుత్వం ప్రకటన చేయాలని కోరుతున్నారు. విధివిధానాలు ప్రకటించాలని, భృతి ఏ కొద్దిమందికో దక్కే విధంగా కొర్రీలు లేకుండా చూడాలని వేడుకుంటున్నారు.

ప్రతి ఇంటిలోనూ నిరుద్యోగులు

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో 95,292 గృహాలు ఉన్నాయి. వీటిలో దాదాపుగా ప్రతి ఇంటిలోనూ నిరుద్యోగులు ఉన్నారు. నగరంలో ప్రతి ఒక్కరూ ఇంటర్ నుంచి డిగ్రీ, డిప్లొమా, ఇంజినీరింగ్ వంటి ఏదో ఒక కోర్సు పూర్తి చేసి ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్నారు. 2019లో అధికారం చేపట్టిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చింది. ఒక్కో సచివాలయంలో 12 శాఖలకు సంబంధించిన ఉద్యోగులు ఉండేలా రూపకల్పన చేసింది. మొత్తం నియోజకవర్గంలో 96 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో 1,152 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. గత ప్రభుత్వం ఒకే నోటిఫికేషన్‌తో లక్షలాది ఉద్యోగాలు కల్పించింది. ఇందులో భాగంగా సెంట్రల్‌లో ఒక్క సచివాలయాల్లోనే 1,152 మంది ఉద్యోగాలు పొందారు. ఇవి కాక కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు కల్పించింది. స్కిల్ హబ్స్ ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణనిచ్చింది.



కూటమి సూపర్-6 హామీల్లో మొట్టమొదటి ప్రాధాన్యత అయిన 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి

2014–19 మధ్య పరిస్థితులే వస్తాయా..?

2014–19 మధ్య చంద్రబాబు ప్రభుత్వం అధికారంలో ఉంది. అప్పటి ఎన్నికల్లో చంద్రబాబు ఇంటికో ఉద్యోగం, లేకుంటే నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చారు. అనేకానేక నిబంధనలు పెట్టి చివరికి ఎన్నికల ముందు ఎంపిక చేసిన కొద్ది మందికి భృతి ఇచ్చి మమ అనిపించారు. టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో నిరుద్యోగులు నాటి రోజులనే గుర్తు చేసుకుంటున్నారు. అదే జరిగితే తమ పరిస్థితి ఏమిటని నిరాశ చెందుతున్నారు. నిరుద్యోగ భృతిపై స్పష్టమైన ప్రకటన చేయాలని కోరుతున్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి యువనేస్తం పేరుతో నిరుద్యోగ భృతి రిజిస్ట్రేషన్ అంటూ కొన్ని మెసేజ్‌లు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. వాటిలో పేర్కొన్న అంశాలు నిరుద్యోగులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఏది ఏమైనప్పటికి భృతికి స్పష్టమైన ప్రకటన చేయడంతో పాటు తక్షణమే అమలు చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు. ఉచిత ఇసుక, తల్లికి వందనం జీవో చూసిన నిరుద్యోగులు మాత్రం 'నిరుద్యోగ భృతి హుళక్కేనన్న నిర్ణయానికి వచ్చేశారు. వారిలో నెలకొన్న ఆందోళనలు తొలగిపోవాలంటే ప్రభుత్వం తక్షణమే జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి విడుదల చేయాలని నిరుద్యోగ సంఘాల ప్రతినిధులు, యువజన సంఘాలు కోరుతున్నాయి.

షరతులు లేకుండా నిరుద్యోగ భృతి చెల్లించాలి



ఎన్నికల సమయంలో ఏ ఆంక్షలు లేకుండా నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. హామీని నమ్మి కూటమిని అధికారంలోకి తెచ్చారు. అధికారం చేపట్టి నెలరోజులు కావస్తున్నా దీనిపై ప్రభుత్వం ప్రకటన చేయలేదు. నిబంధనల పేరుతో పథకం వర్తించకుండా చేయొద్దు. ఇప్పటికే యువనేస్తం పేరుతో నిరుద్యోగ భృతి రిజిస్ట్రేషన్ అంటూ వచ్చిన నిబంధనలు పథకాన్ని నీరు గార్చేవిగా ఉన్నాయి. హామీ మేరకు ఎటువంటి షరతులు లేకుండా నిరుద్యోగులందరికీ భృతి చెల్లించాలి.

– పరుచూరి రాజేంద్రబాబు, ఏఐవైఎఫ్ అధ్యక్షుడు

ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నాం



నేను బీఎస్సీ పూర్తిచేశాను. కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నెలకు రూ. 3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించడంతో నిరుద్యోగులంతా ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నాం. నెల రోజులు గడిచినా మా భృతి గురించి ఎవరూ మాట్లాడకపోవడం బాధాకరంగా ఉంది. ప్రభుత్వం నిరుద్యోగ యువత పడుతున్న కష్టాలను గుర్తించి ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. లేకుంటే చెప్పిన మాట ప్రకారం ఉద్యోగం వచ్చే వరకు రూ. 3 వేల నిరుద్యోగ భృతిని ఇవ్వాలని కోరుతున్నాం.

– డి.ప్రతాప్, అజిత్‌సింగ్‌నగర్

త్వరితగతిన భృతిని ఇవ్వాలి



ఎన్నికల మేనిఫెస్టోలో చంద్రబాబు నాయుడు ప్రకటించిన విధంగా నిరుద్యోగ యువతకు నెలకు మూడు వేల రూపాయల భృతి ఇవ్వాలి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఇంటికో ఉద్యోగం ఇస్తామని, ఉద్యోగం కల్పించే వరకు నిరుద్యోగ భృతిని అందజేయడం జరుగుతుందని ప్రకటించారు. అధికారం చేపట్టి నెల రోజులైనా ఇంత వరకు నిరుద్యోగ భృతి గురించి ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదు. ప్రభుత్వ ప్రకటన కోసం ఎదురుచూస్తున్నాం. ప్రభుత్వం త్వరితగతిన భృతిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

– ఎం.నాగిరెడ్డి, పాయకాపురం

ఇంట్లో డబ్బులు అడగాల్సి వస్తోంది



నేను బీకాం పూర్తిచేశాను. నా విద్యార్హతకు తగిన ఉద్యోగం రాలేదు. ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాను. ప్రతీ చిన్న విషయానికి ఇంట్లో డబ్బులు అడగాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగ భృతి అందిస్తే మాకు ఆర్థిక సమస్యలు కొంత మేర తగ్గే అవకాశం ఉంది. నిరుద్యోగ భృతి సాధ్యమైనంత త్వరగా అందించాలి. భృతి ఇవ్వడం ద్వారా నిరుద్యోగుల్లో ఆత్మవిశ్వాసం పెరగడంతో పాటు ఉపాధి పొందేందుకు ప్రయత్నించే అవకాశం కలుగుతుంది. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ నిరుద్యోగ భృతి ఇవ్వాలి.

– బుట్టి రవికుమార్, రామలింగేశ్వరపేట

బహుముఖ ప్రతిభాశాలి డాక్టర్ కేఎల్ రావు

విజయవాడ కల్చరల్: బహుముఖ ప్రతిభాశాలి డాక్టర్ కేఎల్‌రావు అని శాతవాహన కళాశాల కరస్పాండెంట్ నిడుమోలు రమాసత్యనారాయణ అన్నారు. విజయవాడ బ్రాహ్మణ సమాఖ్య సంఘం ఆధ్వర్యంలో విశ్వవిఖ్యాత ఇంజినీర్ డాక్టర్ కేఎల్ రావు(కానూరి లక్ష్మణరావు) జయంతి వేడుకలను పాత బస్‌స్టాండ్‌లోని ఆయన విగ్రహం వద్ద సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు డాక్టర్ కేఎల్‌రావు విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రమాసత్యనారాయణ మాట్లాడుతూ తెలుగు వారి కీర్తి పతాకాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు డాక్టర్ కేఎల్‌రావు అని అభివర్ణించారు. కేఎల్‌రావు మనుమడు విజయభాస్కర్ మాట్లాడుతూ స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకున్న మహనీయుడు అని కొనియాడారు. కుటుంబం కన్నా దేశ రక్షణకే ప్రాధాన్యతనిచ్చేవారన్నారు. తొలి ప్రధాని నెహ్రూ కూడా వనరుల సంరక్షణ, నీటి వినియోగం గురించి సలహాలు తీసుకునే వారని గుర్తుచేశారు. బ్రాహ్మణ సంఘం సమన్వయకర్త జింకా చక్రధర్ మాట్లాడుతూ గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి డాక్టర్ కేఎల్‌రావు పేరు పెట్టాలని, త్వరలో పౌర విమానయాన శాఖ మంత్రికి వినతి పత్రం అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శర్వాణీమూర్తి, బ్రాహ్మణ సంఘం నాయకులు ఏలేశ్వరపు జగన్మోహనరాజు, తూములూరి కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్ కేఎల్ రావు విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

స్వయం కృషితో ఉన్నత శిఖరాలు

విజయవాడ కల్చరల్: స్వయం కృషితో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చునని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాల విశ్రాంత అధ్యాపకుడు బ్రహ్మానందరావు అన్నారు. తెలుగు కళావాహిని, కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం, శ్రీ కళాభారతి, సంగీత సమ్రాట్ అండ్ కేవీ బ్రహ్మానందరావు కళావేదిక ఆధ్వర్యంలో సోమవారం గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదిక మీద క్లాసికల్ సినీ సంగీత విభావరి, హైకోర్ట్ న్యాయవాది యద్దనపూడి హేమలత, సినీ స్టిల్ ఫొటో గ్రాఫర్ కట్టా జ్యోతిలకు పురస్కారాల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బ్రహ్మానందరావు సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ జీవిత విశేషాలను వివరించారు. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత వెన్నా వల్లభరావు స్టిల్ ఫొటో గ్రాఫర్ సినీ రంగ విజయాలను వివరించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు ఆధ్వర్యంలో న్యాయవాది యద్దనపూడి హైమావతికి సకల విద్యాసరస్వతి పురస్కారం, కట్టా సాయి జ్యోతికి విశిష్ట ఛాయారత్న పురస్కారం ప్రదానం చేశారు. వివిధ సంస్థల ప్రతినిధులు బోడి ఆంజనేయరాజు, డేవిడ్‌రాజు, గాయకుడు ప్రిన్స్ పాల్గొన్నారు.


హైమవతి, కట్టా సాయి జ్యోతిలకు పురస్కారాలను అందజేస్తున్న నిర్వాహకులు

నగరాల కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలి

కలెక్టర్‌కు విన్నవించిన నగరాల సంఘం ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నగరాల విద్యార్థులకు బీసీ కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని శ్రీ నగరాల సంఘం ప్రతినిధులు కలెక్టర్ సృజనకు విన్నవించారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలిసి కులధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని వినతి పత్రం అందజేశారు. నగరాలకు, ఇతర బీసీ కులాలకు చెందిన విద్యార్థులకు తహశీల్దార్లు కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లను ఇవ్వడం లేదని కలెక్టర్‌కు వివరించారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ నగరాల ప్రతినిధులకు హామీ ఇచ్చారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో నగరాలు సంఘం అధ్యక్షుడు ఎన్వీ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ సూర్యారావు, ప్రధాన కార్యదర్శి బాయిన శేఖర్‌బాబు తదితరులు ఉన్నారు.


కలెక్టర్ సృజనను కలిసి వినతి పత్రం అందజేస్తున్న నగరాల సంఘం ప్రతినిధులు

• గోతులను సరిచేయండి సారూ..



మధురానగర్ ఆర్‌యూబీ రోడ్డుపై గుంతల్లో నిలిచిన వర్షపునీరు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నిత్యం రద్దీగా ఉండే మధురానగర్ ఆర్‌యూబీ సర్వీసు రోడ్డులో ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలు పడ్డాయి. దీంతో వర్షపునీరు నిలిచిపోయి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఆర్‌యూబీ మలుపులో గుంతలు పడి వర్షపునీరు నిలవడంతో తరచూ వాహన చోదకులు గోతుల్లో పడి గాయాల పాలవుతున్నారు. అలాగే ఇక్కడ గుంతల వల్ల రోడ్డు ఇరుకుగా మారి రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలను సరిచేయాలని కోరుతున్నారు.

కొనసాగుతున్న టీడీపీ కక్ష సాధింపు చర్యలు


నేలమట్టమైన టీ కొట్టు, వాటర్ ట్యాంక్


టీ కొట్టు కూల్చడంతో నిరాశ్రయులైన కుటుంబం

పాయకాపురం(విజయవాడరూరల్): విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం 63వ డివిజన్లో టీడీపీ కక్షసాధింపు చర్యలు కొనసాగుతున్నాయి. మునిసిపల్ కార్పొరేషన్ అధికారులపై ఒత్తిడితెచ్చి సోమవారం జోరు వర్షంలో వైఎస్సార్ సీపీకి చెందిన మాజీ కార్పొరేటర్ వీర్ల వరలక్ష్మికి చెందిన వాటర్ ట్యాంక్, టీ బడ్డీని కూల్చివేయించారు. కూల్చివేతను వీర్ల వరలక్ష్మి, కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. తమ ఉద్యోగాలు ఉండాలంటే ఈ పనులు చేయక తప్పడంలేదని కార్పొరేషన్ సిబ్బంది పేర్కొనడం గమనార్హం. రాజీవ్‌నగర్ వాటర్ ట్యాంక్ రోడ్డులో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకొనేందుకు ఏర్పాటు చేసుకున్న బడ్డీలను జేసీబీతో తొలగించారు. వైఎస్సార్ సీపీకి చెందిన వారి బడ్డీకొట్లును మాత్రమే తొలగించడంపై స్థానికులు విస్మయం వ్యక్తంచేశారు. ఆక్రమణల పేరుతో ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందీ లేని బడ్డీ కొట్లను తొలగించడంతో వాటిపై ఆధారపడి జీవిస్తున్నవారు ఉపాధి కోల్పోయారు.


రాజీవ్‌నగర్‌లో బడ్డీకొట్టును తొలగిస్తున్న జేసీబీ

ఫిర్యాదులకు త్వరితగతిన పరిష్కారం

పటమట(విజయవాడతూర్పు): ప్రజలు అధికారుల దృష్టికి తీసుకొచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ ఎ.మహేష్ ఆదేశించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. వివిధ సమస్యలపై పలువురు నగరవాసుల 19 అర్జీలు అందించారు. ఈ సందర్భంగా మహేష మాట్లాడుతూ వీఎంసీ అందిస్తున్న మౌలిక వసతుల కల్పనలో ఎదురవుతున్న సమస్యలపై ప్రజలు ఫిర్యాదు చేస్తే అధికారులు వాటికి శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. సర్కిల్ కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదులు–పరిష్కార వేదికపై జోనల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీఎంసీ ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగంపై –రెండు, ఇంజినీరింగ్‌పై –3, ప్రజారోగ్య విభాగంపై –5, పట్టణ ప్రణాళిక విభాగంపై– 6, రెవెన్యూ, పట్టణ సాధికార విభాగం, హౌసింగ్‌పై ఒక్కో ఫిర్యాదు వచ్చాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకర్ రావు, సీపీవో ప్రసాద్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ –1 డాక్టర్ సురేష్ బాబు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ సోమశేఖర్ రెడ్డి, డెప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, అకౌంట్స్ ఆఫీసర్ నరసింహమూర్తి, ఈఈలు పాల్గొన్నారు.


నగర వాసుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ మహేష్

నేడు క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

కృష్ణలంక(విజయవాడతూర్పు):రాఘవయ్య పార్కు సమీపంలోని బాలోత్సవ భవన్‌లోని ఎం.బి.విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు విజ్ఞాన కేంద్రం మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు కె.స్వరూపరాణి ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్యవక్తగా మణిపాల్ హాస్పిటల్ క్యాన్సర్ శస్త్రచికిత్స నిపుణుడు జి.కృష్ణారెడ్డి హాజరవుతారని చెప్పారు.


క్లుప్తంగా

ఐఅండ్‌పీఆర్ డైరెక్టర్ హిమాన్షు శుక్లాకు అభినందనలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సమాచార, పౌర సంబంధాల శాఖ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన హిమాన్షు శుక్లాను సోమవారం ఆయన కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్, ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ప్రతినిధులు వేర్వేరుగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు. శాలువాతో సత్కరించారు.

శ్రీభవానీశంకరస్వామికి ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రా షిర్డీ ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో సోమవారం మరకత పోలిక శ్రీభవానీశంకర స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన రుద్రాభిషేకం, పుష్పార్చనలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను మందిర కోశాధికారి మండలపర్తి సత్యశ్రీహరి పర్యవేక్షించారు.

ప్రమాదకరంగా చెట్ల కొమ్మలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ ఐస్ ఫ్యాక్టరీ సెంటర్‌లో చెట్ల కొమ్మలు ప్రమాదకరంగా మారాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో చెట్లకొమ్మలు ఎండిపోయాయి. దీంతో ఇటీవల వర్షాలకు ఎప్పుడు కొమ్మలు పడిపోతాయోనని స్థానికులు బయపడుతూ రాకపోకలు సాగిస్తున్నారు. వేలాది మంది రాకపోకలు సాగించే ఈ మార్గంలో జరగరానిది జరిగితే ప్రమాద తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉంది. కావున అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అంజుమన్ హిఫాజతే ఔకాఫ్ సంస్థ ఆవిర్భావం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ముస్లిం హక్కుల పరిరక్షణ, వక్ఫ్ భూముల రక్షణకు అంజుమన్ హిఫాజతే ఔకాఫ్ సంస్థ ఆవిర్భవించింది. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆవిర్భావ సమావేశం జరిగింది. సంస్థ రాష్ట్ర అధ్యక్షుడిగా వక్ఫ్ బోర్డు మాజీ సీఈవో, హైకోర్ట్ న్యాయవాది జనాబ్ షబ్బర్ బాషా, ఉపాధ్యక్షుడిగా మహమ్మద్ సల్మాన్ ఖాన్, ప్రధాన కార్యదర్శులుగా సిద్దవటం పీఠాధిపతి పీర్ సయ్యద్ షా షబ్బీర్ ఆలం ఖాద్రి, ఉర్ఫ్ పాలిమాత్ దర్వేష్ సాహెబ్‌ను ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు షబ్బర్ బాషా మాట్లాడుతూ వక్ఫ్ భూములను కాపాడుతామన్నారు. అన్యాక్రాంతమైన వక్ఫ్ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవాలన్నారు. సమావేశంలో పలువురు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సారె సమర్పించిన 43 భక్త బృందాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు సోమవారం 43 బృందాలు ఆషాఢ సారెను సమర్పించాయి. నూజివీడుకు చెందిన దుర్గ బృందంకు చెందిన 35 మంది, గుంటూరుకు చెందిన బాలాజీ సేవా బృందంకు చెందిన 50 మంది, సాయినంద భక్తి బృందంకు చెందిన 60 మంది, ఉండవల్లి సెంటర్‌కు చెందిన టి.శ్రీలక్ష్మీ బృందంకు చెందిన 50 మంది, శ్రీమారుతీ లలితా మండలికి చెందిన 40 మంది, శ్రీరామ భక్త బృందంకు చెందిన 35 మంది, సింగ్‌నగర్‌కు చెందిన కె.మల్లికార్జునరావు బృందంకు చెందిన 45 మంది, రామకృష్ణ కోలాట సంఘంకు చెందిన మరో 30 మంది, గుడివాడకు చెందిన మురళీకృష్ణ కోలాట బృందంకు చెందిన 45 మందితో పాటు విజయవాడలోని వన్‌టౌన్, సత్యనారాయణపురం, విద్యాధరపురం, భవానీపురం ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్త బృందాలు అమ్మవారికి సారెను సమర్పించాయి.

రేపు శ్రీశ్యామలాంబ ఆలయంలో వారాహి ఉత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దావు బుచ్చయ్యకాలనీ శ్రీ శ్యామలాంబ అమ్మవారి దేవాలయంలో బుధవారం వారాహి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త చింతపల్లి కనకారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం వారాహి అమ్మవారికి చండీ హోమం, పుష్పాభిషేకం, లచన్ ఇన్‌ఫ్రా ఆడపడుచుల సారె సమర్పణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు చేసి అన్నప్రసాద వితరణ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. భక్తులు వారాహి ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాల్సిందిగా ఆయన కోరారు.

ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

పాయకాపురం(విజయవాడరూరల్): రాజీవ్‌నగర్‌కి చెందిన పితల గోపి(35) ఉరివేసుకొని మృతి చెందడంతో నున్న పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. మృతుడు గోపికి భార్య, ముగ్గురు పిల్లలు. రెండు వారాల క్రితం మద్యం మత్తులో భార్య, పిల్లలతో గొడవ పడగా వారు వేరుగా ఉంటున్నారు. ఈ నెల 12వ తేదీన రాత్రి ఆటోనగర్‌లో ఉంటున్న తన అక్క, చెల్లెళ్లకు ఫోను చేసి తాను ఉరివేసుకొని చనిపోతానని చెప్పాడు. 15వ తేదీన గోపి అక్క తిరుపతమ్మ వచ్చి చూడగా అప్పటికే ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకొని చనిపోయి దుర్వాసన వస్తున్నాడు. ఈ విషయాన్ని తిరుపతమ్మ తల్లికి చెప్పింది. మృతుని తల్లి అంజలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సీతారామపురంలో వరుస చోరీలు

విజయవాడరూరల్: నున్న గ్రామీణ(పాయకాపురం) పోలీసు స్టేషన్ పరిధి పాతపాడు గ్రామ శివారు సీతారామపురం గ్రామస్తులు వరుస చోరీలతో బెంబేలెత్తుతున్నారు. ఇటీవల గ్రామంలో అవుతు అజయ్‌రెడ్డి(బ్యాంక్ ఉద్యోగి) ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రెండు లక్షల 20వేల రూపాయల నగదు దోచుకెళ్లారు. ఈ సంఘటన జరిగిన రెండో రోజు ఉపాధి పనికి పోలవరం కట్ట మీద వెళ్తున్న పామర్తి లక్ష్మి(50) అనే మహిళ మెడలో బంగారు నానతాడు తెంచుకొని దొంగ పరారయ్యాడు. ఈ రెండు సంఘటనలకు సంబంధించి బాధితులు నున్న పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం కనిపించడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. పోలీసు ఉన్నతాధికారులు సంఘటనలకు సంబంధించి చర్యలు తీసుకోవాలని, గ్రామంలో గస్తీని ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇళ్లు కట్టిస్తానంటూ రూ. 30 లక్షలు మోసం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇళ్లు కట్టిస్తానంటూ నమ్మబలికి రూ. 30లక్షలు తీసుకుని మోసం చేసిన ఘటనపై సోమవారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయ్యింది. పోలీసుల కథనం మేరకు గుంటూరు జిల్లా నెక్కల్లుకు చెందిన గుమ్మ శ్రీనివాసరావుకు జూపల్లి చంద్రశేఖర్ విజయవాడ గుణదల ఇన్నర్‌రింగ్ రోడ్డు వద్ద స్థలం కొనుగోలు చేస్తే భవిష్యత్తులో ఎక్కువ రేటు వస్తుందని నమ్మించాడు. దీంతో శ్రీనివాసరావు రెండు సంవత్సరాల క్రితం ఇంటి స్థలం కొనుగోలు, అందులో ఇళ్లు నిర్మించి ఇచ్చేందుకుగానూ రూ. 30 లక్షల నగదు చంద్రశేఖర్‌కు ఇచ్చారు. కానీ చంద్రశేఖర్ ఇంటి స్థలం కానీ, ఇళ్లుకానీ అప్పగించకుండా దాటవేస్తూ ఉన్నాడు. దీంతో బాధితుడు సోమవారం గుణదల పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.